www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 2 నవంబర్ 2023

5

వైఎస్ఆర్

అమరజీవి ప్రాణత్యాగ ఫలమే ఆంధ్రరాష్ట్ర అవతరణ : కలెక్టర్

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

కడప : తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని నిలిపి, ప్రత్యేకంగా తెలుగు రాష్ట్ర ఆవిర్భావం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులు అమరజీవి పొట్టి శ్రీరాములు అని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు.

ప్రజా వ్యతిరేక విధానాలను
తరిమి కొట్టాలి

- ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని సిఎం జగన్
- ప్రభుత్వ రంగంలో 'ఉక్కు' ఏర్పాటు చేయాలి
- నిరుపయోగంగా గండికోట ప్రాజెక్టు
- కాగితాల్లోనే సోమశిల ఎత్తిపోతల
- 95 శాతం పరిశ్రమలు మూసివేత
- బద్వేల్, కడప ప్రజా రక్షణభేరి బహిరంగ సభల్లో నాయకులు

ప్రజారక్షణభేరి బహిరంగ సభకు హాజరైన బద్వేల్ పట్టణ వాసులు

మాట్లాడుతున్న సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు ఎం.ఎ. గపూర్

బద్వేల్ : అభివాదం తెల్పుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి/బద్వేలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను తరిమికొట్టాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గపూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, కమిటీ సభ్యులు కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళ, బుధవారాల్లో బద్వేల్, కడప పట్టణాల్లో సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని రాష్ట్రాభివృద్ధి కోసం నినాదంతో చేపట్టిన బస్సుయాత్ర సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభల్లో వారు ప్రసంగించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గపూర్ మాట్లాడుతూ రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు కృష్ణాజలాలతోనే మనుగడ సాగుతోందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి సర్కారు అవకాశవాద రాజకీయాలతో దిగువ రాష్ట్రాలకు అన్యాయం చేస్తోందన్నారు. కర్నాటక ఎన్నికల తరుణంలో ఎగువభద్ర ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి రూ.ఆరు వేల కోట్లు కేటాయించిందన్నారు. తెలంగాణ ఎన్నికల తరుణంలో కృష్ణా జలాలపై ట్రిబ్యునల్ వేసి రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఇటువంటి చేష్టల కారణంగా బ్రహ్మంసాగర్, గండికోట, హంద్రీ నీవా వంటి ప్రాజెక్టులు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. బద్వేల్ పట్టణ శివారులో నిరుపేదలు పెద్దసంఖ్యలో ఉన్నారని, అటువంటి నిరుపేదలకు టిడ్కోగృహాలను కేటాయించకుండా తాత్సారం చేయడం దుర్మార్గమన్నారు.

నిర్బంధాలకు ఎదురొడ్డాలి : ప్రభాకర్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధ విధానాలకు ఎదురొడ్డి నిలబడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే నిర్బంధాల్ని ప్రయోగిస్తోందన్నారు. మన సంక్షేమం, మన పిల్లల భవిష్యత్ బాగుండాలనే నియంతృత్వ పోకడలను అధిగమించాలని తెలిపారు. ఇంటింటికీ వచ్చే రాజకీయ పార్టీలను తమ పిల్లల భవిష్యత్ కోసం ఎన్ని పరిశ్రమలు తెచ్చారో నిలదీయాలన్నారు. అంగన్వాడీ, ఉపాధ్యాయ, అసంఘటిత, సంఘటిత రంగాల ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారా ప్రజాపోరాటాలను విస్తృతం చేయాలన్నారు.

ప్రభుత్వ రంగంలో 'ఉక్కు' ఏర్పాటు చేయాలి : కృష్ణయ్య

కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడం ద్వారా నిరుద్యోగులకు, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. ఫలితంగా ఇక్కడి నుంచి ఇతర దేశాలకు, ఇతర రాష్ట్రాలకు వలసలు నిలిచిపోతా యని తెలిపారు. రాష్ట్రంలోని పాలకులు ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం ద్వారా లభించే ప్రయోజనాల్ని గమనించడం లేదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు రిక్రూట్‌మెంట్ అయిన మొదటి15 మంది ఇంజినీర్లలో తానూ ఒకడినని, ఉక్కు పరిశ్ర మను ఏర్పాటు చేస్తే జిల్లా ఆర్థిక, సామాజిక ముఖచిత్రంలో పెనుమార్పులు సంభవిస్తాయని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలోని పాలకులు విభజన హామీ లను నెర వేర్చాలని కేంద్రంపై ఒత్తిడి చేయడం లేదన్నారు.

ఆ పార్టీల విధానాలొక్కటే : ఉమామహేశ్వరరావు

రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన విధానాలు ఒక్కటేనని, ఫలితంగా దేశ సంపదను కొద్ది మంది చేతుల్లో పోగుబడేలా చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర నాయకులు ఉమా మహేశ్వరరావు అన్నారు. ఫలితంగా పేదరికం, దారిద్ర్యం తాండవం చేస్తున్నాయని తెలిపారు. 16 రకాల నిత్యావసరాల ప్యాకేజీని అందించే సిపిఎం మో డల్ కావాలా, సంక్షేమ పథకాల పేరుతో కొంత మందికి అరకొర సంక్షేమ చర్యలకు పరిమితమయ్యే మోడల్ కావాలో ఆలోచించుకోవాలన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల్లో కదలికేదీ : భాస్కరయ్య

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల్లో ఎటువంటి కదలిక లేదని, ఫలితంగా లక్షలాది ఎకరాల ఆయకట్టు ప్రశ్నా ర్థకంగా మారిందని సిపిఎం రాష్ట్ర నాయకులు భాస్కరయ్య తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇంటింటికీ తిరగాలని చెబుతున్నాడని, పాదయాత్రలో తీసుకున్న అర్జీలు ఏమ య్యాయని నిలదీయాలని విజ్ఞప్తి చేశారు. బాబు హయాంలోని విద్యుత్ ఉద్యమంలో ముగ్గురిని బలి తీసు కున్నారని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏడు షర తులతో యూజర్ ఛార్జీలను విధిస్తుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్‌ఫోన్ ఛార్జీల తరహాలో నగదు ఖర్చయిపోయిన వెంటనే కరెంటు సరఫరా నిలిచిపోయేలా స్మార్ట్‌మీటర్లు బిగిస్తున్నారని హెచ్చరించారు.

నూతన విద్యా విధానాన్ని నిలిపేయాలి : రమాదేవి

నూతన విద్యావిధానం పేరుతో పాఠశాలలను విలీనం చేస్తు న్నారని, ఫలితంగా స్త్రీలకు విద్యను దూరం చేయాలనే కుట్రతోనే ఇటు వంటి విధానాలను తీసు కొచ్చారని సిపిఎం రాష్ట్ర నాయకులు రమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ప్రతి మూడు నిమిషాలకు అత్యాచారం, ప్రతి 15 నిమిషాలకు ఒక హత్యలు చోటుచేసుకుంటున్న దశలో ఆడపిల్లలు విద్యాభ్యాసం సాగించడం సాధ్య పడడం లేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో భేటీ బచావో..భేటీ పడావో నినాదాలకు ఎటువంటి ఉపయోగం ఉండబోదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు.కార్మికుల సంక్షేమబోర్డులోని నిధులను దారి మళ్లించి, భవన నిర్మాణ కార్మికులను గాలికి వదిలేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు శివకుమార్, మనోహర్, శ్రీనివాసులరెడ్డి, దస్తగిరిరెడ్డి, ఓబులేసు, శివకుమార్, చంద్రారెడ్డి, పాపిరెడ్డి ప్రజలు, రైతులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

కడప : కృష్ణయ్యకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

బద్వేల్ : కళాజాతా నిర్వహిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

కరువు మండలాల ప్రకటనలో

జిల్లాకు మొండిచేయి

- అన్నమయ్యలో 23 మండలాల ప్రతిపాదనలు
- 18 మండలాలకే పరిమితం

నిరసన తెలియజేస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో కడప జిల్లాకు మొండిచేయి చూపించింది. అధికార యంత్రాంగం జిల్లాలోని 36 మండలాల్లో 17 మండలాలను కరువు ప్రాంతాలుగా ఎంపిక చేసి ప్రతిపాదనలు అందజేసింది. ప్రభుత్వం కరువు మండలాల ఎంపికకు అనుసరించిన కేంద్ర ప్రభుత్వ ఆధారిత ఏడు పారామీటర్లలో భాగంగాలోటు వర్షపాతం, సాగు విస్తీర్ణం, నీటిపారుదల శాఖ, భూగర్భజలాల తగ్గుదల, ఉపాధి హామీ, పశు గ్రాసం, తాగునీటి కొరత ప్రాతిపదికన కరువు మండలాలను ఎంపిక చేసినట్లు సమాచారం. జిల్లాలోని 36 మండలాల్లో ఏ ఒక్క మండలాన్ని ఎంపిక చేయడం పట్ల విమర్శల వర్షం కురుస్తోంది. అన్నమయ్య జిల్లా అధికార యంత్రాంగం జిల్లాలోని 30 మండలాల్లో 23 మండలాలను ఎంపిక చేసి ప్రతిపాదనలు అందజేసింది. ఇందులో 18 మండలాలను కరువు ప్రాంతాలుగా ఎంపిక చేసింది. మిగిలిన ఐదు మండలాలు కరువు పీడిత మండలాలుగా ఎంపిక చేయకపోవడం గమనార్హం. అన్నమయ్య జిల్లాలో ఎంపిక చేసిన మండలాలను పరిశీలిస్తే గాలివీడు, చిన్నమండెం, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గుర్రంకొండ, కలకడ, కంభంవారిపల్లి, పీలేరు, టి.సుండుపల్లి, వీరబల్లి, తంబళ్లపల్లి, పెద్దమండెం, కురబలకోట, పెద్దతిమ్మసముద్రం, బి.కొత్తకోట, నందలూరు, పెనగలూరు మండలాలను ఎంపిక చేసింది.

కనికరం లేని ముఖ్యమంత్రి : ఎపి రైతు సంఘం

కడపఅర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ 103 కరువు మండలాలు ప్రకటిస్తే కడప జిల్లాలో ఒక్క కరువు మండలం కూడా ప్రకటించకపోవడం చాలా దుర్మార్గమని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. దస్తగిరి రెడ్డి తెలిపారు. బుధవారం ఎపి రైతు సంఘం కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కడప పాత బస్టాండ్ దగ్గర నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 36 మండలాలలో ఖరీఫ్ సీజన్ ముగిసేనాటికి తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. వేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయని, జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి కరువు మండలాలను ప్రకటించే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. వర్షాభావ విపత్తుతో వేసిన పంటలు ఎండు దశకు చేరుకున్నాయని సన్న, చిన్న కారు, మధ్యతరగతి రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రబీ సీజన్‌కు రైతులు విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్నా చినుకులు పడలేదని తెలిపారు. రైతులకు భరోసా ఇచ్చే విధంగా జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు గ్రామాలలో పర్యటించాలని కోరారు. ఎండిపోయిన పంటలకు తక్షణమే ఈ క్రాప్ చేయాలని డిమాండ్ చేశారు. కరువు కోరల్లో చిక్కిన రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని పేర్కొన్నారు. జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరువు సహాయక చర్యలు, కరువు మండలాలు ప్రకటించకపోతే పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, జిల్లా నాయకులు రంగారెడ్డి, చిన్న సిద్దయ్య, శ్రీనివాస్ రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు రామ్మోహన్, సుబ్బమ్మ, శ్రీనివాసులు రెడ్డి, చంద్రారెడ్డి, శివకుమార్, ఓబులేష్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్

కడప : మండల స్థాయిలో వైద్యాధికారులు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అండ్ సాధికారిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సభా భవన్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మితో కలిసి జిల్లాలోని పిహెచ్‌సి వైద్యులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యాధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ వైద్యులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గుర్తించిన 3759 మంది కంటి శుక్లాల కేసులను, ఆరోగ్యశ్రీలో రెఫెర్ చేసిన సాధారణ వ్యాధులు సంబంధించి 2458 మందికి శస్త్ర చికిత్సలు ఈ నెల 5 లోపు పూర్తి చేయాలని వైద్యులను ఆదేశించారు. సచివాలయ స్థాయి నుండి మండల స్థాయి వరకు సమన్వయంతో పని చేయాలన్నారు.

డిఇఒ అవినీతిపై చర్యలేవీ? : ఎస్ఎఫ్ఐ

కడప అర్బన్ : జిల్లా విద్యాశాఖాధికారి వై.రాఘవరెడ్డి పై వచ్చిన అవినీతి, అక్రమాలపై సాక్ష్యాధారాలతో సహా జిల్లా కలెక్టర్ నియమించిన విచారణ అధికారికి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ విమర్శించారు. బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై.రాఘవరెడ్డి కడప జిల్లాకు డిఇఒగా నియమితులైన నాటి నుంచి అనేక అవినీతి కార్యక్రమాలకు పాల్పడ్డారని చెప్పారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల నుంచి భారీగా ముడుపులు వసూలు చేయడం, ఇవ్వకపోతే ఏదో ఒక రకంగా వేధింపులకు పాల్పడటం ఆయన నైజమన్నారు. జూన్‌లో జరిగిన ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ భారీగా అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. డిఇఒ అవినీతిపై ఎవరైనా ఉపాధ్యాయులు ప్రశ్నిస్తే వారిని బెదిరించడం, బూతులు మాట్లాడటం, వేధించడం నిత్య కృత్యంగా మారిందన్నారు. బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాలలో జరిగిన విద్యార్థి మృతి సంఘటనలో డబ్బులు ఇవ్వాలని పాఠశాల యాజమాన్యాన్ని డిఇఒ బ్లాక్ మెయిల్ చేసినట్టు ఆ పాఠశాల కరస్పాండెంట్ పత్రికాముఖంగా ప్రకటించడంతోపాటు, అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవన్నారు. కనీసం ఆరోపణలపై విచారణ జరిపిన పాపాన పోలేదన్నారు. చంద్రమౌళి ఎయిడెడ్ పాఠశాల వ్యవహారంలో కూడా అక్కడి కరస్పాండెంట్ ను అకారణంగా దూషించారని తెలిపారు. గుర్తింపు లేని పాఠశాలలపై పలుసార్లు ఫిర్యాదు చేసినా వారి నుంచి మామూళ్ళు వసూలు చేస్తున్నారే తప్ప చర్యలు లేవని వాపో యారు. ఆయనపై 22 ఆరోపణలతో సాక్ష్యాధారాలతో సహా జూలైలో కలెక్టర్ కు ఫిర్యాదు చేశామని, అందుకు డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్ ను విచారణాధికారిగా నియమిస్తే రెండు నెలలు కాలయాపన చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి అవినీతి డిఇఒపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఈనెల 10వ తేదీ నుంచి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గండి సునీల్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి వై.రాహుల్ పాల్గొన్నారు.

మెస్ ఛార్జీలు విడుదల చేయాలి

కడపఅర్బన్ : హాస్టల్ విద్యార్థులకు మెస్ బిల్లులు ఇవ్వకుండా సామాజిక న్యాయ భేరి యాత్ర చేయడం అన్యాయమని పిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు అన్నారు. బుధవారం సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వసతి గృహలలో చదువుతున్న విద్యార్థులకు ఐదు నెలలుగా మెస్ ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. . రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, గురుకుల వసతిగృహాలు 4035 ఉన్నాయని తెలిపారు. వీటిలో సుమారు 6,15,665 మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. వీరికి ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి మెస్ ఛార్జీలు అందలేదన్నారు. సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు నాగేంద్ర, లక్షుమయ్య పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ

కడప అర్బన్ : గురుకుల్ విద్యాపీఠ్ హైస్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న మనస్వి కరాటేలో మంచి ప్రతిభ కనబరిచారని సిఇఒ వివేకానంద తెలిపారు. పతకం సాధించిన విద్యార్థినిని అభినందించారు. అక్టోబర్ 28న నిర్వహించిన పోటీలలో బంగారు పతకం గెలుచుకుందని తెలిపారు.ఈ నెల 20న నేపాల్‌లో జరిగే తేక్వాండో పోటీలలో విద్యార్థిని పాల్గొననుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ మునిచంద్ర, విపి నరసింహ, ఎఓ ఆకాశ్‌నందన్, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ సిద్ధేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

డివైఎఫ్ఐ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి -కడప అర్బన్

డివైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని నిహర్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు అధ్యక్షతన జెండాను జిల్లా కార్యదర్శి శివకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో వారి ఆశయ సాధన కోసం అందరికీ విద్య, అందరికీ ఉపాధి ప్రభుత్వ బాధ్యతగా ఉండాలని కోరుతూ 1980వ సంవత్సరం నవంబర్ 1,2,3 తేదీలలో పంజాబ్ రాష్ట్రం లుధియానా నగరంలో డివైఎఫ్ఐని దేశ నలుమూలల నుంచి వచ్చిన ఆనాటి యువతి, యువకులు ఏర్పాటు చేశారని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అవిశ్రాంతంగా పోరాడుతూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ 43 సంవత్సరాల కాలంలో భారతదేశంలో ఘనమైన చరిత్రను నిర్మించిందని తెలిపారు. అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలో నిరుద్యోగాన్ని, పేదరికాన్ని, దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనార్టీల పై దాడులు, దౌర్జన్యాలు పెంచారని ఆరోపించారు. యువతకు ఉపాధి కల్పన కేంద్రాలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెట్టడం ఉన్న దేశీయ చిన్న, చిన్న పరిశ్రమలు మూతపడేలాగా చేయడం వల్ల 6 కోట్ల ఉద్యోగాలు ఊడిపోయాయని తెలిపారు. కేంద్రంలో 10 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్న, రాష్ట్రంలో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. యువతి, యువకులందరూ ఐక్యంగా పోరాడి చదువుకు తగ్గ ఉద్యోగం, యువత సామర్థ్యానికి తగ్గ ఉపాధి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జగదీష్, నిరుద్యోగ రాష్ట్ర కన్వీనర్ షేక్.సిద్ధికి, నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, డి.ఎం. ఓబులేసు, జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా నరసింహులు పాల్గొన్నారు.

టిడికె సంఘం నాయకులకు సత్కారం

కడప అర్బన్ : తొగట వీర క్షత్రియ సంఘం రాష్ట్ర కమిటీలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన బొల్లు సోమశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రమాణ స్వీకారం చేసిన బొమ్మిశెట్టి చంద్రశేఖర్‌ను తొగటవీర క్షత్రియ కుల బంధువులు చౌడం సూరి బాబు, గాలి రవిప్రకాష్ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం చేశారు. నగర పరిధిలోని కృష్ణాపురంలో ఉన్న శ్రీ చౌడేశ్వరి దేవి మాత ఆలయ సన్నిధిలో రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్ హాజరై సత్కరించారు.

సమగ్ర విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - కడప

కడప నగరం కృష్ణ సర్కిల్ వద్దగల యాకూబ్ సాహెబ్ మసీదు రూముల బాడుగల విషయంపై ఉపముఖ్యమంత్రి, కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలని ముస్లిం మైనార్టీ నాయకులు, వికాస్1 విద్యాసంస్థల అధినేత సుభాన్ బాష డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ వదల తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మసీదు కమిటీ, వక్స్ బోర్డ్ కమిటీ, మసీదు రూముల అద్య వసూలు చేసే కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యాకూబ్ సాహెబ్ మసీద్ కమిటీ ప్రెసిడెంట్‌ను రూములకు సంబంధించి ఎంత ఆదాయం వస్తుందని అడిగామని, 19 అద్దె రూములే ఉన్నాయని, రూ.81 వేలు బాడుగలు వస్తున్నాయని చెప్పారన్నారు. అయితే మసీదుకు సంబంధించిన స్థలంలో దాదాపు 61 బాడుగ రూములు 1999లో నిర్మించడం జరిగిందని తన విచారణలో తేలింది అన్నారు. వచ్చే బాడుగల్లో ఏడు శాతం వక్స్ బోర్డుకు చెల్లించినా కూడా మిగిలిన డబ్బులు మసీదు కమిటీ ఏమి చేస్తుందో అర్థం కావడం లేదన్నారు. వీటన్నిటిపై సమగ్ర విచారణ జరిపించి తగు న్యాయం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో ముస్లిం నాయకులు రఫీ ఉద్దీన్, షబ్బీర్, సుల్తాన్ బాబా పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సుభాన్‌బాష

గౌరవ కార్యదర్శిగా ఇ.ఆర్.ఎ.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కడప అర్బన్



గౌరవ కార్యదర్శి వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న సభ్యులు

కడప, కర్నూల్ జిల్లా పరిధిలో ఐఇఐ, కడప సెంటర్ గౌరవ కార్యదర్శిగా ఎవిఆర్ విద్యా సంస్థల అధినేత ఇ.ఆర్.ఎ. వెంకటేశ్వర్లు, ఛైర్మన్‌గా కెఆర్ఆర్ఎం కళాశాల ఇసిఇ ప్రొఫెసర్ డాక్టర్ వి.ఆది నారాయణరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ సంస్థ అభివృద్ధి ఇంజినీర్ల సహకారంతో వీలవుతుందని తెలిపారు. అభివృద్ధికి శాయశక్తుల, నిబద్ధతతో, నిర్విరామంగా కృషి చేస్తామని చెప్పారు. కార్యవర్గ సభ్యులుగా గణేష్, వెంకటరామయ్య, వెంకటసుబ్బారెడ్డి, చౌడప్ప, విజయభాస్కర్‌రెడ్డి, హేమలత, పలువురు ఎన్నికయ్యారు. కడప లోకల్ సెంటర్ తొలి మహిళా కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ హేమలత, ఇంజనీరు షహనాజ్ ఎన్నికయ్యారు.

రాష్ట్రంలో రావణ పాలన : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో రావణ పాలనకు చరమగీతం పాడాలని టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, అమీర్ బాబు, మన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం 14వ డివిజన్‌లో ప్రకాష్ నగర్‌లో డివిజన్ ఇన్‌ఛార్జి ఆమూరి బాలరాజు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు జైలు నుంచి బయటకు రావాలని నారా భువనేశ్వరి యాత్రను ప్రారంభించారన్నారు. చంద్రబాబు ఆరోగ్యవంతంగా తిరిగి ప్రచారాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. టిడిపి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అధికారంలోకి వచ్చేలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాసులు, కొండ సుబ్బయ్య, ఓబుల్ రెడ్డి, శివ, జయ రామిరెడ్డి, అడ్వకేట్ శంకర్ రెడ్డి, ఏసన్న, శీను, అశోక్, నాగేంద్ర నాయుడు, శేషయ్య నాయుడు, మురళీకృష్ణ, శంకరయ్య, రాజు, విద్యాసాగర్, గంగులయ్య, అనిల్, వంశీ, ప్రవీణ్, చైతన్య, సుబ్బరాయుడు, లావణ్య, స్వర్ణ, నిర్మల, ఉమాదేవి, మల్లేశ్వరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు జెర్సీలు పంపిణీ

ప్రజాశక్తి - కడప

క్రీడాకారులతో మైఖేల్ డేనియల్ ప్రదీప్

క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 12-18 సంవత్సరాలలోపు ఉన్న120 మంది క్రీడాకారులకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్(శాప్) డైరెక్టర్ మైఖేల్ డేనియల్ ప్రదీప్ కుమార్ చేతుల మీదుగా జెర్సీలు పంపిణీ చేశారు. బుధవారం కడప ప్రభుత్వ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాకీ, ఫుట్‌బాల్, కరాటే, వాలీబాల్ క్రీడాకారులకు స్పోర్ట్స్ జెర్సీలను అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో మంచి ప్రతిభ ఘనపరిచే క్రీడాకారులకు ఎప్పుడూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో కోచ్ అమృత్‌రాజ్, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సుధీర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తా

ప్రజాశక్తి - కడప



కేక్ కట్ చేస్తున్న వెన్నపూస మధురెడ్డి

అందరి ఆశీస్సులతో యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వెన్నపూస మధురెడ్డి అన్నారు. బుధవారం తన జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు మిత్రులు, శ్రేయోభిలాషుల మధ్య వెన్నపూస మధు రెడ్డి ఘనంగా నిర్వహించుకున్నారు. కేక్ కట్ చేసి అందరికీ తినిపించారు. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు వెన్నపూస మధు రెడ్డికి ఈ సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శంకర్, రవీంద్ర, సూర్య, శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, బాషా మోహిద్దీన్, మౌలా, సోహైల్, సతీష్, ముస్తాక్, మన్సూర్, మనోజ్ పాల్గొన్నారు.

జంప్‌రోప్ క్రీడాకారుడికి ప్రోత్సాహం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మహమ్మద్ బాషా అంతర్జాతీయ స్థాయి జంప్ రోప్ క్రీడకు ఎంపికయ్యాడు. ఈ క్రీడాకారుడు థాయి లాండ్‌లో జరిగే పోటీలో పాల్గొనబోతున్న సందర్భంగా బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. మైదుకూరు ముస్లింల తరుపున ప్రోత్సాహకంగా రూ.50వేల నగదును మైదుకూరు అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎపి మస్తాన్ చేతుల మీదుగా అందించారు. అనంతరం సిఐ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో పతకం సాదించి, పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు అన్నిటా నైపుణ్యం సాధించాలని కోరారు. కార్యక్రమములో న్యాయవాది అబ్దుల్లా, ఎ.యాకూబ్ హుస్సేన్, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఎస్ఐలు మద్దిలేటి, రమణ, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారుడిని అభినందిస్తున్న న్యాయవాది అబ్దుల్లా

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు పులివెందుల క్రీడాకారులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు పులివెందులకు చెందిన హాకీ క్రీడాకారులు ఎంపికైనట్లు స్థానిక ఇండోర్ స్టేడియం ఇన్‌ఛార్జి ఎం.శేఖర్, హాకీ కోచ్ రవికుమార్ తెలిపారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లె గ్రామంలో ఈ నెల 3 నుండి 5వ తేదీ వరకు 67వ స్కూల్ గేమ్స్ అండర్-17 రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌కు పులివెందులకు చెందిన క్రీడాకారులు చందు, సుశాంత్ ఎంపికైనట్లు వారు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, స్టెప్ సిఇఒ సాయి గ్రేస్, చీఫ్ కోచ్ అమృత్‌రాజ్, పులివెందుల ఇండోర్ స్టేడియం ఇన్‌ఛార్జి ఎం శేఖర్, హాకీ కోచ్ రవికుమార్ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

ఎంపికైన విద్యార్థులతో స్టేడియం ఇన్‌ఛార్జి, కోచ్

వైసిపి పాలనలో అర్హులందరికీ లబ్ధి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వైసిపి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందాయని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని రాజారెడ్డి కాలనీ, రాజీవ్ కాలనీలలో బుధవారం వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, వైస్ చైర్మన్ హాఫిజ్ పార్టీ నాయకులతో కలిసి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి, ఎంత లబ్ధి పొందారో ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరించారు. కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వివి నరసింహారెడ్డి, కౌన్సిలర్లు, కోడి రమణ, పార్నపల్లె కిషోర్, కో-ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, నాయకులు రాజా కులాయప్ప, డేరంగుల చంద్రమౌళి, పద్మనాభరెడ్డి, రసూల్, ఫక్రుద్దీన్, సంపత్, డేనియల్, సిద్దయ్య, ఓబులేసు, హరికృష్ణ, నాగరాజు, శ్రీరాములు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వివరిస్తున్న మనోహర్‌రెడ్డి

వ్యాయామం ఆరోగ్యానికి రక్ష

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మంచి అలవాట్లు, వ్యాయామం ఆరోగ్యానికి రక్ష అని కల్లూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి మహాలక్ష్మి తెలిపారు. మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సోములవారిపల్లె రెండవ సచివాలయంలో బుధవారం జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత ఆరోగ్య సమాచారం అనే కరదీపికను వైద్యాధికారి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కరదీపికలో సామాన్య ప్రజలకు అవసరమైన ఆరోగ్య పరమైన సమాచారం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇందులోని సమాచారాన్ని అవగాహన చేసుకోవాలని కోరారు. మందులతోపాటు ఆహారపు అలవాట్లు, వ్యాయామం ద్వారా వ్యాధుల నుండి సురక్షితంగా ఉండవచ్చని వైద్యాధికారి పేర్కొన్నారు. కార్య క్రమంలో సూపర్‌వైజర్ బి.ఎ.వరప్రసాద్, యంఎల్‌హెచ్‌పీ గంగ తులసీ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్త గాయత్రి, ఆశా కార్యకర్తలు కరుణామణి, చంచమ్మ, సాలమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

కరదీపికను అందజేస్తున్న వైద్యాధికారి మహాలక్ష్మి

బాలికతో మాట్లాడుతున్న సిఐ వెంకటరమణ

తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని త్రీటౌన్ సిఐ వెంకటరమణ తెలిపారు. యర్రగుంట్ల మండలానికి చెందిన మైనర్ బాలిక తప్పిపోగా బుధవారం తల్లి వద్దకు చేర్చారు. ఇందుకు సంబందించిన వివరాలిలా ఉన్నాయి. యర్రగుంట్ల మండలం ధర్మల్‌కు చెందిన లక్ష్మీదేవి తన కుమార్తెను ఎర్రగుంట్ల గ్రామంలో పెద్దమ్మ వద్ద చదివిస్తున్నారు. ఎర్రగుంట్ల నుండి సొంత ఊరికి వచ్చిన బాలికను తల్లి మంగళవారం బస్సు ఎక్కించి పంపారు. బాలిక పెద్దమ్మ ఇంటికి చేరుకొని అక్కడి నుండి ఎవరికీ చెప్పకుండా తనకిష్టమైన పెద్దనాన్న పిల్లలు ఉన్న ప్రొద్దుటూరు హాస్టల్‌కు వెళ్లాలని ప్రొద్దుటూరుకు చేరుకుంది. హాస్టల్ ఆచూకీ తెలియకపోవడంతో తిరిగి తిరిగి అలసిపోయి సాయంత్రం స్థానిక కోర్టు వద్దకు చేరుకొని ఒంటరిగా కూర్చుంది. గమనించిన త్రీటౌన్ పోలీసు కానిస్టేబుల్ పవన్ బాలికకు ధైర్యం చెప్పి మహిళా పోలీసుల ద్వారా వివరాలు అడిగారు. బాలిక సరిగా సమాచారం ఇవ్వకపోవడంతో బాలిక ఫొటో వాట్సప్ గ్రూపులో పెట్టగా.. వివరాలు తెలుసుకొని బాలిక తల్లి స్టేషన్‌కు చేరుకొని విషయం చెప్పడంతో బాలికను తల్లి లక్ష్మీదేవికి అప్పగించారు.

బస్సులో రూ.లక్ష నగదు చోరీ

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రయాణికురాలు కొత్త బస్టాండులో బస్సు ఎక్కి పాత బస్టాండ్ వెళ్లే లోపు రూ.లక్ష చోరీకి గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగుంట్ల మండలం చిలమకూరుకు చెందిన లక్ష్మీ బుధవారం తొండూరులోని కొత్తపల్లెకు వెళ్లేందుకు తాడిపత్రి బస్సు ఎక్కి ముద్దనూరు కొత్త బస్టాండులో దిగింది. పులివెందులకు వెళ్లే బస్సు ఎక్కి పాత బస్టాండుకు వెళ్లేలోపు తన వద్ద ఉన్న రూ.లక్ష చోరీకి గురైంది. బాధితురాలు డ్వాక్రాలో డబ్బులు తీసుకుని ఆమె బావకు అప్పు చెల్లించేందు వెళుతుండగా చోరీ జరిగింది. బాధితురాలు బోరున విలపించారు.

వేంపల్లెలో వీధి కుక్కల స్వైర విహారం

మెయిన్ రోడ్డుపై గుంపులుగా ఉన్న కుక్కలు

ప్రజాశక్తి - వేంపల్లె

మండల కేంద్రమైన వేంపల్లె గ్రామంలో వీధి కుక్కల బెడద అధికమైంది. కుక్కలు గుంపులుగా స్వైరవిహారం చేస్తూ చిన్నాపెద్ద అని తేడా లేకుండా దాడి చేస్తున్నాయి. దీంతో ప్రజలు, ద్విచక్ర వాహనాదారులు భయాందోళనకు గురవుతున్నారు. వేంపల్లె గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైనా అధికారులు పట్టించుకోవడం లేదని వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు ఆరోపించారు. కుక్కలతో రోడ్ల మీద ప్రయాణించాలంటే ప్రజలు హడలిపోతున్నారని తెలిపారు. కుక్కలను పూర్తిస్థాయిలో అధికారులు నియంత్రణ చేయకపోవడంతో వీటి భయం ఎక్కువైందని భయపడుతున్నారు. కుక్కల బెడద ఎప్పుడు తప్పుతుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. రోడ్ల మీద ప్రయాణిస్తున్న వారిపై, ద్విచక్ర వాహనాలపై కుక్కలు ఒక్క సారిగా దాడి చేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వేంపల్లెలోని గరుగువీధి, శ్రీరాం నగర్, శ్రీ చైతన్య పాఠశాల, పిరమిడ్ నగర్, మైయిన్ బజార్, గాంధీ రోడ్డు, కడప రోడ్డుతోపాటు ఆయా ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగా ఉన్నాయి. రాత్రి సమయంలో వెళ్లే ప్రజలను కుక్కలు వెంబడిస్తున్నాయి. చాలామంది కుక్క కాటుకు గురై ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నారు. గతంలో ఆయా ప్రాంతాల్లో ఉన్న కుక్కలను బంధించి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టేవారు. ప్రస్తుతం ఆ తరహా చర్యలు కనిపించడం లేదని ముత్యాల ఆంజనేయులు పేర్కొంటున్నారు. కుక్కలను చంపకుండా వాటి సంతతిని పెరగకుండా చేసేందుకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉండగా, వాటిని సైతం ఎక్కడా అమలు చేసిన దాఖాలాలు లేవని వాపోయారు. ఆయా వార్డుల్లో కుక్కల బెడద ఎక్కువ కావడంతో ప్రజలు రోడ్ల వెంట ప్రయాణించేందుకు నానా కష్టాలు పడుతున్నారు. కుక్కల స్వైర విహారంతో ఇంటి నుంచి అడుగు బయట పెట్టాలంటే జనం జంకుతున్నారు. పలు ప్రాంతాల్లో వీధి దీపాలు సరిగా లేకపోవడంతో కుక్కలు గుంపులు, గుంపులుగా సేద తీరుతున్నాయి. పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లేవారిపై కుక్కలు దాడికి పాల్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా కుక్కల బెడద తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులతోపాటు ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకొంటాం

వేంపల్లెలో కుక్కల బెడద తప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కుక్కలు పట్టే వారిని పిలిపిస్తున్నాం. సమస్యను ప్రజాప్రతినిధులు కూడా చెప్పారు. అన్ని వీధుల్లో తిరిగి కుక్కలను పట్టి ఇతర ప్రాంతాల్లోని అడవుల్లో విడిచి పెడతాం. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం.

- సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి

అండగా ఉంటున్నాం.. మరో అవకాశం ఇవ్వండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు అవుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 20వ వార్డు సచివాలయం పరిధిలో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులతో కలిసి నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. సమస్యలు గురించి మహిళలతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పథకాలు మంజూరు కావాలంటే మండల కార్యాలయాలు, అధికారులు, నేతలు చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల ద్వారా జగనన్న మెరుగైన పాలన అందిస్తున్నారని ఆయన వివరించారు. రాబోవు రోజుల్లో జగనన్నకు ప్రజలందరూ అండగా ఉండి మరోసారి సిఎంగా జగన్‌ను గెలిపించాలని సుధీర్‌రెడ్డి కోరారు. డ్రయినేజీ సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ వేల్పుల శివమ్మ , మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముల్లా జానీ, వార్డు కౌన్సిలర్ షామీర్, వైసిపి సీనియర్ నాయకులు రుషికేశవరెడ్డి, బుజ్జి, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రభుత్వాస్పత్రిపై అపోహాలొద్దు : 'రాచమల్లు'

ల్యాబ్ పరికరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిపై ఎలాంటి అపోహాలొద్దని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో స్థానిక ప్రభుత్వాసుపత్రి రోజురోజుకూ శక్తివంతంగా తయారవుతోందని, అన్ని రకాల మెరుగైన వైద్యసేవలు ఇక్కడ అందుతున్నాయని తెలిపారు. వీటిని సద్వినియోగపరచుకోవాలని రాచమల్లు కోరారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బుధవారం 'ఇంటిగ్రేటెడ్ పెబ్లిక్ హెల్త్‌ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలు రకాల రక్తపరీక్షల నిమిత్తం రూ.1.20కోట్ల ఖర్చుతో ల్యాబ్ ప్రారంభించామన్నారు. ఉచితంగా, వేగంగా నివేదికలు అందుతాయన్నారు. 40 నిమిషాల్లో 600 మందికి రక్తపరీక్షలు చేసి ఫలితాలను చెప్పే అవకాశముందన్నారు. ఈ పరీక్షలు బయట చేయించుకోవాలంటే వేల రూపాయలు ఖర్చు అవుతందని ఆయన తెలిపారు. ఖరీదైన యంఆర్ఐ, సిటి స్కానింగ్ వంటి ఖరీదైన పరీక్షలు ఇక్కడ ఉచితంగా అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి తాత్కాలిక బెయిల్‌పై బయటికి వచ్చాడని ఈ అమావాస్య చంద్రుడి గురించి ఇంత పెద్దగా సంబరాలు చేయడం దండగ అన్నారు. బాబు పరిస్థితి పెనంలో నుంచి పొయ్యిలో పడినట్లయిందన్నారు. ఇన్ని ఆంక్షలతో వచ్చిన బెయిల్‌ను బెయిల్ అనరని ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు కౌన్సిలర్ వరికూటి మాట్లాడుతూ బెనర్జీ హత్యాయత్నం కేసులో ప్రవీణ్ కుమార్‌రెడ్డి, నందం సుబ్బయ్య సతీమణి అపరాజిత కుట్ర ఉందన్నారు. ఈ ఘటనతో ప్రవీణ్‌కు ఎలాంటి సంబంధంలేకపోతే నేరుగా పోయి ఎస్‌పిని కలవాలిగానీ, ఎందుకు పారిపోతాడని ఆయన ప్రశ్నించారు.

పశుగ్రాస క్షేత్రాలను ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పశుగ్రాస క్షేత్రాల ఏర్పాటుతో వేసవిలో గ్రాసం కొరత రాదని, వాటిని ఏర్పాటు చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ శారదమ్మ రైతులకు సూచించారు. మండలంలోని హిమకుంట్ల గ్రామంలో బుధవారం పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతులు గ్రూపుగా ఏర్పడి పశుగ్రాస క్షేత్రాల పెంపకం చేపట్టాలని సూచించారు. ఇందుకుగానూ ప్రభుత్వం ఆర్థికసాయం చేస్తుందన్నారు. పశుగ్రాసం పెంపకం ద్వారా తమకు అవసరమైన మేరకు నిలువ చేసుకొని, మిగిలింది రైతులకు అమ్ముకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమ అభ్యున్నతికి పెద్ద పీట వేస్తోందన్నారు. వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా పాడి ఏర్పాటు చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ఏపీ డీడీసీఎఫ్ మేనేజర్ వెంకటేశ్వరి, డిసిసి బ్యాంక్ మేనేజర్ చైతన్య, పశువైద్యా ధికారి యూసఫ్, డిఆర్డిఏ ఏపీ మంజునాథ్, సీసీ మహేష్, వివోఏ శిరీష, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జెడి శారదమ్మ

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలు

పులివెందుల మార్కెట్ యార్డ్‌లో అమరజీవికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని నిలిపి, ప్రత్యేకంగా తెలుగు రాష్ట్రం ఆవిర్భావం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులు అమరజీవి పొట్టిశ్రీరాములు అని అని మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి తెలిపారు. మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ సిబ్బంది, చీనీ కాయల వ్యాపారస్తులు, రైతులు పాల్గొన్నారు.

చాపాడు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ వేడుకలు మైదుకూరు ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో స్థానిక అమ్మ వారిశాలలో నిర్వహించారు. పొట్టిశ్రీరాములు చిత్ర పటానికి నివాళి అర్పించారు. అనంతరం మార్కెట్‌లోని అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అవొపా అధ్యక్షులు దరిశా శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో యలవలి హరికిషన్, దొంతు వెంకట సుబ్బయ్య, ఎలిశెట్టి గురుప్రసాద్, దరిశా శ్రీనివాసులు, పబ్బతి వేణు, పల్లె వెంకటేశ్వర్లు, ఇమ్మిడిశెట్టి సతీష్, చిల్లంకూరి మారుతి, మలిపెద్ది హరినాథ్, అయ్యప్పశెట్టి సురేంద్ర, పబ్బతి రాజా, గోపాల్, రామగుప్తా, సునీల్, రామయ్య, చంద్ర పాల్గొన్నారు.

కరువు మండలాల ప్రకటన కంటి తుడుపే..!

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో కరువు మండలాలను ప్రకటించడంలో ఆలస్యం చేయడమే కాక అన్యాయం చేసిందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం సెప్టెంబర్ 24నే కరువు ప్రాంతాలను ప్రకటించిందన్నారు. కేంద్ర అధికారుల బృందం రాష్ట్రానికి వచ్చి క్షేత్ర పరిశీలన చేసి కూడా వెళ్లారని తెలిపారు. కాని జగన్ ప్రభుత్వం అక్టోబర్ 31న ప్రకటించిందని చెప్పారు. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో, 440 మండలాల్లో వర్షపాతం తగ్గడంతో కరువు నెలకొందన్నారు. వైకాపా ప్రభుత్వం కేవలం 103 మండలాలను మాత్రమే కరువుగా ప్రకటించి, రాష్ట్ర ప్రజలను అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కడప జిల్లాలో ఒక్క మండలాన్ని కూడా కరువు కింద ప్రకటించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలపై పునరాలోచించి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. యుద్ధ ప్రాతిపదికన కరువు సహాయక చర్యలు చేపట్టాలని తులసిరెడ్డి కోరారు. విలేకరుల సమావేశంలో పులివెందుల మండల కమిటీ అధ్యక్షుడు కేతిరెడ్డి తిరుపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు రమేష్, బాలం సుబ్బరాయుడు, సమన్వయ కమిటీ సభ్యులు ఉత్తన్న, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించిన బిటెక్ రవి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు సమీపంలో నూతనంగా నిర్మించిన టిడిపి కార్యాలయాన్ని బుధవారం ఆ పార్టీ పులివెందుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన తన సతీ మణితో అక్కడ ఏర్పాటు చేసిన హోమంలో పూజా కార్యక్రమాలను నిర్వహిం చారు. కార్యక్ర మానికి తెలుగు దేశం పార్టీ నాయ కులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. లింగారెడ్డి, వరదరాజులరెడ్డి, భూపేష్‌రెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తొండూరు శివమోహన్ రెడ్డి, మురల్‌రెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి, ఇతర నాయకులు, మాజీ పట్టణ అధ్యక్షులు బ్రాహ్మణపల్లి వెంకటరామిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, తూగుట్ల రాఘవేంద్రరెడ్డి, జోగిరెడ్డి, భరత్‌రెడ్డి, నల్లగారి భాస్కర్‌రెడ్డి, మా బాషా, హక్కుల గారి విజయ కుమార్‌రెడ్డి, బొజ్జ మైసూరారెడ్డి, లింగాల విశ్వనాథ్‌రెడ్డి, అమర్ పాల్గొన్నారు.

హోమం నిర్వహిస్తున్న బిటెక్ రవి దంపతులు

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఒక్క తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే సాధ్యమవుతుందని జమ్మలమడుగు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్‌లో బుధవారం బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రతి గడపకూ తిరుగుతూ వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి, తాను ఎమ్మెల్యే అయిన ఆరు నెలల్లో సమస్యలను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజల్లో చంద్రబాబుకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక వైసిపి ప్రభుత్వం ఆధారాల్లేని కేసులు పెడుతోందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో సైకో ప్రభుత్వాన్ని గద్దెద్దించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మండల బాధ్యులు మోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, బయపురెడ్డి, సేట్, టైలర్ మాబు, సుంకర నాగేశ్వరరావు, సంజీవ్, శివ, వినయ్, దొరబాబు, భాస్కర్, శేఖర్, వెంకటేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక నాయకులతో భూపేష్‌రెడ్డి

అధికార పార్టీ ఆగడాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులా..?

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అధికార పార్టీ ఆగడాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులా అని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జెబిఉల్లా పేర్కొన్నారు. ప్రతిపక్ష టిడిపిలో ఉంటూ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి జి.వి.ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు, అరెస్టు చేయించిన సందర్భాలున్నాయన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజుల క్రితం బెనర్జీపై జరిగిన హత్యాయత్నం దాడి కేసులో ప్రవీణ్ పాత్ర ఉందంటూ ఎమ్మెల్యే రాచమల్లు ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. గతంలో బెనర్జీ పలువురు వైసిపి నాయకులని బెదిరించిన నేపథ్యం గలవాడని, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మునిసిపల్ వైస్ చైర్మన్ ఖాజా, కౌన్సిలర్లు వంగనూరు మురళీధర్ రెడ్డి, మునీర్‌లను బెదిరించినట్లు వారు పోలీస్‌స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారన్నారు. అలాంటి వ్యక్తిని నాడే ఎమ్మెల్యే రాచమల్లు మందలించి ఉంటే నేడు ఇంతటి అనర్థం జరగకపోయి ఉండేదని అభిప్రాయపడ్డారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాస్ యాదవ్, మాజీ కౌన్సిలర్ బాతుల సుబ్బరాయుడు, 14వ వార్డు మస్తాన్ గోలే పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జెబిఉల్లా

రాష్ట్రంలో రాక్షసపాలన రాజ్యమేలుతోంది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రంలో రాక్షసపాలన రాజ్యమేలుతోందని, అవినీతిపరులు కాలర్ ఎగరేస్తూ తిరుగుతున్నారని టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సతీమణి జివి మౌనిక ఆరోపించారు. రూరల్ పరిధిలోని పొట్టిపాడు రోడ్డులోని యానాది కాలనీలో బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ తన భర్తపై అక్రమ కేసులు బనాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రజల పక్షాన మాట్లాడితే అక్రమ కేసులు బనాయించడం వైసిపి పెద్దలకు అలవాటుగా మారిందని తెలిపారు. ఈ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించడంలేదన్నారు. రోడ్లు, డ్రయినేజీలు శిథిలావస్థకు చేరుకున్నాయని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ బోడెల బాబుల్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురాంరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, రాజుపాలెం మండల కన్వీనర్ ధనిరెడ్డి విశ్వనాథరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకురాలు మౌనిక

అన్ని జిల్లా కమిటీలు రద్దు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఎస్సీ జనసంఘం జాతీయ అధ్యక్షులు దాసగాని కుల్లాయప్ప ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జనసంఘం జిల్లా కమిటీలను రద్దు చేస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దరాజు తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ 2024 జనవరిలో కమిటీలను పునర్నిర్మాణం చేస్తామన్నారు. ఇప్పటి వరకు కమిటీలో బాధ్యతాయుతంగా పని చేసిన వారితోపాటు కొత్తవారికి కూడా భవిష్యత్తులో అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు బత్తల సుబ్బరాయుడు, పసుపులేటి శివకృష్ణ, రవీంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతన్న పెద్దరాజు

IN THE COURT OF HON'BLE II Additional Jr. CIVIL JUDGE, KADAPA

O.S.No. 774/2021

Vennapusa Koteswaramma.

...Plaintiff

Vs

Sunkesula Ramudu.

...Defendant

NOTICE

పై దావాలో వాది అప్పు వసూలు చేసుకొనుటకు ప్రతివాది అయిన మీ మీద దావా దాఖలు చేసియున్నారు. పై తెల్పిన కోర్టులో మహారాజరాజశ్రీ వారు 06/11/23 తేదీ ఉదయం 10.30ని॥లకు కోర్టులో మీరు కాని లేదా మీ తరపున అడ్వకేటు హాజరు అయి ఆక్షేపణలు ఏమైన ఉన్న తెలుపుకోవలెనని లేదా మీకు పరోక్షంగా ఉత్తర్వులు ఇచ్చెదరని తెలిపియున్నారు.

Y. PRASAD, B.Sc., L.L.B.,
వాది తరపు న్యాయవాది,
కడప. సెల్: 7013161449.